# నమస్తే తెలంగాణ

## ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ శుక్రవారం 17 మే 2024 | ADILABAD NIRMAL




ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని బాబుజగ్జీవన్ రాం చౌక్‌లో వడ్లతో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ నాయకులు

ఆదిలాబాద్‌లో నిరసనలో పాల్గొని నినదిస్తున్న రైతు విలాస్



బోథ్ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ర్యాలీ తీస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ నాయకులు



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని బాబుజగ్జీవన్ రాం చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జోగు రామన్న

# నాలుక మర్లేసిన సర్కారుపై మర్లవడ్డ రైతన్న

## వడ్లకు బోనస్ కోసం బాసటగా నిలిచిన బీఆర్ఎస్

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గులాబీ శ్రేణులు, అన్నదాతల రాస్తారోకో
- ధర్నాలతో దద్దరిల్లిన మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పడంపై మండిపాటు
- ఆదుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక
- రైతు సమస్యలపై పోరాటం చేస్తాం.. : మాజీ మంత్రి రామన్న



ఖానాపూర్ టౌన్ : రాస్తా రోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



భైంసా : ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నిర్మల్ అర్బన్ : జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు





ఆదిలాబాద్‌లో వడ్లతో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి రామన్న, ఎంపీ అభ్యర్థి సక్కు, నాయకులు

> అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి రైతులకిచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా దాటవేత ధోరణి అవలంబిస్తుండడంపై రైతన్నలు భగ్గుమన్నారు. ప్రధానంగా ధాన్యానికి బోనస్ విషయంలో రేవంత్ మాట మార్చడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోనస్ సన్నవడ్లకే ఇస్తామని, రైతులు అధికంగా పండించే దొడ్డురకం ధాన్యానికి ఇవ్వబోమంటూ రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై రైతులు నిరసన బాట పట్టారు. రైతుల ఆందోళనలకు బీఆర్ఎస్ పార్టీ బాసటగా నిలిచింది. ఇందులో భాగంగానే రైతులకు మద్దతుగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగాయి. రైతులు, గులాబీ శ్రేణులు వడ్ల గింజలతో నిరసన తెలిపారు. రహదారులపై రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అధికారులకు వినతిపత్రాలు కూడా అందించారు.

ఆదిలాబాద్/నిర్మల్, మే 16(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే ఆ త్రం సక్కు, రైతులు, గులాబీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చక రేవంత్ రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.500 బోనస్ చెల్లించి వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని, రైతులు కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నదాతలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రుణమాఫీ విషయంలో దేవుళ్లపై ఓట్లు పెట్టుకుంటూ రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేశారన్నారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లను పండిస్తారని, కేవలం 10 శాతం మంది సన్నాలను పండిస్తారన్నారు. సన్న వడ్లు పండించే 10 శాతం మంది రైతులకు మాత్రమే రూ.500 బోనస్ చెల్లిస్తామని సీఎం ప్రకటించడం వారిని దగా చేయడమే అని తెలిపారు. రైతులకు న్యాయం జరిగింత వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, అజయ్, సాజిదొద్దీన్, వేణుగోపాల్, మార్సెట్టి గోవర్ధన్, లింగారెడ్డి, రాంకుమార్, పర్వీన్ పాల్గొన్నారు. కాగా.. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు బోథ్ తహసీల్దార్ సుభాష్‌చందర్‌కు గులాబీ శ్రేణులు వినతి పత్రం సమర్పించాయి.

### నిర్మల్ జిల్లాలో..

ఖానాపూర్ పట్టణంలో నిర్మల్-ఖానాపూర్-జగిత్యాల ప్రధాన రహదారిపై తెలంగాణ తల్లి చౌరస్తాలో నిర్వహించిన ధర్నా, రాస్తా రోకోతో వాహనాలు నిలిచిపోయాయి. దాదాపు గంట పాటు రాకపోకలు స్తంభించాయి. భైంసా పట్టణంలో పార్టీ నాయకులు విలాస్ గాదేవార్ ఆధ్వర్యంలో నిరసనకు తెలిపి, ఆర్డీవో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రైతులందరిని మోసం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇష్టానుసారంగా హామీలిచ్చి, అధికారం చేపట్టిన తర్వాత ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. ముఖ్యంగా రుణమాఫీ, రైతు భరోసా విషయంలో ప్రభుత్వం కనీస స్థాయిలో స్పందించలేదన్నారు. యాసంగి దిగుబడులు చేతికొచ్చి నెల రోజులవుతున్నా కల్లాల్లోనే ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని, సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా.. ఎంపీ ఎన్నికలు కాగానే బోనస్‌పై కూడా మాట మార్చాడని మండిపడ్డారు. నిన్న మొన్నటి వరకు ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని, ఇప్పుడు తిరకాసులు పెడుతూ కేవలం సన్న రకం ధాన్యానికి బోనస్ ఇస్తామని, దొడ్డు రకాలకు ఇవ్వమని ప్రకటించడం దారుణమన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని పూటకో మాట మారిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కాగా జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నాయి.



గుడిహత్నూర్ : హనుమాన్ నగర్‌లో లేచిపోయిన ఇంటిపైకప్పు



ఇంద్రవెల్లి : రోడ్డుపై పడ్డ చెట్లను పరిశీలిస్తున్న ప్రయాణికులు



గుడిహత్నూర్ : ఈదురుగాలులకు కింద పడిపోయిన కరెంటు స్థంభం



నార్నూర్ : మాన్కాపూర్ ప్రధాన రహదారిపై నెలకొరిగిన చెట్టును తొలగిస్తున్న గ్రామస్తులు

# జోరువాన

## ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం

- పడిపోయిన విద్యుత్ స్తంభాలు
- లేచిపోయిన ఇండ్ల పైకప్పులు

గుడిహత్నూర్/ఇంద్రవెల్లి/నార్నూర్, మే 16 : ఆదిలాబాద్ జిల్లాలో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. గుడిహత్నూర్ మండలంలో వడగళ్ల వర్షం పడింది. ఇంటి పైకప్పులు లేచిపోయాయి. ఈదురుగాలులతో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి, విద్యుత్ సరఫరాను మెరుగుపర్చారు. ఇంద్రవెల్లి మండలంలో భారీ వృక్షాలు నెలకొరిగాయి. ఈశ్వర్‌నగర్ సమీపంలో ప్రధాన రోడ్డుపై చెట్టు విరిగి పడిపోవడంతో గంట సేపు రాకపోకలు స్తంభించాయి. ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు నిలిపోవడంతో అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సునీల్ స్థానికుల సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. నార్నూర్‌లో గాలివాన బీభత్సానికి పలు చోట్ల వృక్షాలు నెల కొరిగాయి. చేలలో చేతికొచ్చిన జొన్న పంటకు నష్టం వాటిల్లింది. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్నలు విక్రయించేందుకు వచ్చిన రైతులు పంట తడవకుండా ఉండేందుకు రైతులు తిప్పలు పడ్డారు.



గుడిహత్నూర్ : సర్వీస్ రోడ్డుపై పడిపోయిన చెట్టు

# విత్తనాలను అందుబాటులో ఉంచాలి

- వానకాలం సాగుకు సన్నద్ధం కావాలి..
- 18లోపు విత్తనాల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



అధికారులు, డీలర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 16 : ఆదిలాబాద్ జిల్లాకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచాలని, వానకాలం సాగుకు సన్నద్ధం కావాలని, ఇందుకోసం ఈ నెల18వ తేదీలోగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన, ఎరువుల డీలర్లతో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. డీలర్ల షాపు లైసెన్సులు తప్పని సరిగా ఉండాలని, విత్తనాలు, ఎరువులు షాపులో ఉన్న స్టాక్‌ను రోజువారీగా నమోదు చేసి, బిల్‌బుక్ రిజిస్టర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మరాదని, గడువు ముగిసిన విత్తనాలు, ఎరువులు అమ్మరాదని రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువుల కొరత ఉండకూడదన్నారు. నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞన్, వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య పాల్గొన్నారు.

# 'కంది'పై చర్యలు తీసుకోవాలి..



వన్‌టౌన్ సీఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

ఎదులాపురం, మే 16 : ఎన్నికల్లో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డిలు బీజేపీ పార్టీ నుంచి సిమెంట్ బస్తాలలో డబ్బులు తీసుకున్నట్లు కాంగ్రెస్ అసెంబ్లీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న తప్పు ప్రచారాన్ని నిరూపించాలని ఆదిలాబాద్ రూరల్ తంతోలి మాజీ ఉప సర్పంచ్ రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డిలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వన్ టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీనివాస్‌రెడ్డికి ధైర్యం ఉండే చేసిన వ్యాఖ్యలను నిరూపించాలని డిమాండ్ చేశారు. మహిళలను అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేసిన శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సీఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేసిన వారిలో సీనియర్ నాయకులు చిల్కూరి లక్ష్మారెడ్డి, ప్రభాకర్ మధూకర్, వసీం, ఇమ్రాన్, తుడుం వినోద్, రాసాం కిష్టు, మునీర్, వహీద్ ఉన్నారు.